సాక్షి
చిత్తూరు
శనివారం । 24 । జూన్ । 2023



పెండింగ్ లేకుండా పరిహారం

జిల్లాలో హైవే రోడ్డు పనులకు సంబంధించి నష్టపరిహారం పెండింగ్ లేకుండా అందజేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. - 10లో



ఆనంద దాంపత్యానికి..

యువతీయువకులు పెళ్లికి ముందే ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారు. అనారోగ్య సమస్యలు లేనివారినే ఎంచుకుంటున్నారు. - 10లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	25
తిరుపతి	34	26
తిరుమల	30	22
గూడూరు	36	28
నగరి	35	26

పేదలకు రూ. 2లక్షల కోట్ల పథకాలు

నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాల ద్వారా రూ.రెండు లక్షల కోట్లను పేద, బడుగు, బలహీన వర్గాలకు అందించామని రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. కుప్పం నియోజకవర్గంలో పల్లె బాట కార్యక్రమంలో భాగంగా ఆయన మొదటి రోజు శుక్రవారం గుడుపల్లె మండలంలో పర్యటించారు. పలు సభల్లో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల హామీలను పూర్తిగా నెరవేర్చారని చెప్పారు. నాలుగు సంవత్సరాల్లోన్నే ఈ ఘనత సాధించడం ఓ రికార్డుగా అభివర్ణించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆదరిస్తే రెట్టింపు అభివృద్ధికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

- మళ్లీ ఆదరిస్తే రెట్టింపు ఇస్తాం
- ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం
- కుప్పం అభివృద్ధి బాధ్యత నాది
- గుడుపల్లె పల్లెబాటలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



బెగ్గిలిపల్లె సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం

కుప్పం/గుడుపల్లె: కుప్పం నియోజకవర్గంలో పల్లె బాట కార్యక్రమంలో భాగంగా బెగ్గిలిపల్లి, శెట్టిపల్లి, గుడికొత్తూరు, యామిగానిపల్లి, కనమనపల్లి, కంచిబందార్లపల్లి, గుండ్లసాగరం, పొగురుపల్లి, బిసానత్తం గ్రామాల్లో మంత్రి పెద్దిరెడ్డి పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం ఇంత పెద్ద ఎత్తున రూ.కోట్ల నిధులు ఖర్చు చేసిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చూస్తారని, అలాంటి నాయకుడు మనకు ముఖ్యమంత్రిగా ఉండడం మనం చేసుకున్న పుణ్యమని తెలిపారు. చంద్రబాబు కేవలం రాజకీయ లబ్ధికోసమే ప్రయత్నిస్తారని, ఈ విషయాన్ని కుప్పం ప్రజలు గుర్తించారని అన్నారు. రానున్న ఎన్నికల్లో బాబుకు బుద్ధి చెప్పడం ఖాయమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో 600 హామీలు ఇచ్చిన బాబు తన పాలనలో ఒక్క హామీని నెరవేర్చలేకపోయారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దశల వారీగా మహిళల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారని తెలిపారు. నమ్మిన వారిని మోసం చేయడం చంద్రబాబు వంతు అయితే... నమ్మిన వారినే ఎలాగైనా కాపాడుకోవడం జగన్‌మోహన్‌రెడ్డి నైజమని పేర్కొన్నారు.

కుప్పం అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

35 ఏళ్లుగా కుప్పం ఓట్లతో గెలుస్తున్న చంద్రబాబు చేసింది ఏమి లేదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కుప్పానికి రెవెన్యూ, పోలీసు డివిజన్లు వచ్చాయని తెలిపారు. నియోజక వర్గ కేంద్రమైన కుప్పంను మున్సిపాలిటీగా చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మున్సిపాలిటీకి తక్షణ అభివృద్ధికి రూ.66 కోట్లు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించిన నాయకుడు జగన్ అని తెలిపారు. యామిగానిపల్లె, ముద్దనపల్లె వద్ద రెండు సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల నిర్మాణం కోసం మరో రూ.500 కోట్లు కేటాయిస్తామన్నారు. సాధారణంగా ప్రతిపక్ష నాయకుడి నియోజకవర్గాలను అధికార పక్షం పట్టించుకోదని, తాము అలా చేయడం లేదన్నారు. కుప్పాన్ని, పులివెందుల, పుంగనూరుకు సమానంగా భావించి అభివృద్ధి చేసే బాధ్యత తనదని పేర్కొన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం పాల్గొన్నారు.



పల్లెబాటలో మంత్రి పెద్దిరెడ్డి, నాయకులు

3నెలల్లో కుప్పానికి హంద్రీ–నీవా నీళ్లు

మూడు నెలల్లో హంద్రీ–నీవా కాలువ పనులు పూర్తి చేసి కుప్పానికి కృష్ణా జలాలను తీసుకు వస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గత సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుప్పం పర్యటన సందర్భంగా కొన్ని హామీలు ఇచ్చారని, ఇందుకు అనుగుణంగా పనులు వేగంగా సాగుతున్నట్లు చెప్పారు. ఈ సభలో ముఖ్యమంత్రి ఎన్నికల్లోపు కుప్పానికి కృష్ణాజలాలు తీసువస్తామని హామీ ఇచ్చారని, మరో మూడు నెలల్లో కుప్పం కృష్ణా జలాలు తీసుకు వచ్చేందుకు పనులు వేగంగా సాగుతున్నట్లు వివరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో హంద్రీనీవా పనులు 90శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 10శాతం పనులు చేయలేక విమర్శలు చేయడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. ఇంకా చాలా ప్రాజెక్టులు తీసుకువస్తామంటే కోర్టులకు వెళ్లి చంద్రబాబు అడ్డుపడుతున్నారని విమర్శించారు. ఎక్కడ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పేరువస్తోందని బాబు ఆందోళన చెందుతున్నారని ఆరోపించారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు..

గుడుపల్లె మండల పరిధిలో జరిగిన అన్ని సభల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పీబీ వాడ వాసులు విశ్వనాథ్, అమీన్, వెంకటేష్, రాజు, వెంకటేష్, భాస్కర్‌తో పాటు 20 మంది చేరారు. యామగానిపల్లెలో టీడీపీ పంచాయతీ ప్రెసిడెంట్ శివారెడ్డితో పాటు 50 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. గుండ్లసాగరం పంచాయతీలో వెంకటేష్, సుబ్రమణ్యంతో పాటు 20 కుటుంబాలు చేరాయి. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ భరత్, రెస్కో చైర్మెన్ సెంథిల్ కుమార్, మున్సిపల్ చైర్మెన్ డాక్టర్‌సుధీర్, ఏఎంసీ చైర్మెన్ విద్యాసాగర్, ఎంపీపీలు వరలక్ష్మి గోపి, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామకృష్ణ, సర్పంచులు నాగభూషణం, భాస్కర్, నాగరాజు పాల్గొన్నారు.



మంత్రి సమక్షంలో పార్టీలో చేరిన గుడికొత్తూరు వాసులు

న్యూస్‌రీల్

టెన్త్ సప్లిమెంటరీలో మూడో స్థానం



వివరాలను వెల్లడిస్తున్న డీఈఓ విజయేంద్రరావు, ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో చిత్తూరు జిల్లా మూడో స్థానంలో నిలిచింది. శుక్రవారం ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో విజయేంద్రరావు, సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణారెడ్డి ఫలితాల వివరాలను వెల్లడించారు. వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 6,500 మంది విద్యార్థులు హాజరు కాగా, 5,706 మంది ఉత్తీర్ణత చెందారన్నారు. జిల్లా ఉత్తీర్ణత శాతం 87.78 నమోదైనట్లు తెలిపారు. బాలురు 3,924 మందికి గాను 3,392 మంది, బాలికలు 2,576కు గాను 2,314 మంది ఉత్తీర్ణత చెందారన్నారు. బాలుర ఉత్తీర్ణత 86.44, బాలికల ఉత్తీర్ణత 89.83 శాతంగా ఉన్నట్లు వివరించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మాట్లాడుతున్న అన్సు

పూతలపట్టు: పర్యావరణ పరిరక్షణపై అవగాహన దేశవ్యాప్త సైకిల్ యాత్ర చేస్తున్న తమిళనాడు రాష్ట్రం నామక్కల్ జిల్లాకు చెందిన అన్సు(66) శుక్రవారం పూతలపట్టు కేంద్రానికి చేరుకున్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ. చెట్లను నరకడం, ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు తగ్గించాలన్నారు. వాహనాల నుంచి వెలువడే పొగల వల్ల గాలి పూర్తిగా కలుషితమవుతోందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను తెలియజేసేందుకు 2005 ఏప్రిల్ 22న దేశవ్యాప్త సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటివరకు 20 రాష్ట్రాల్లో 49 వేల కిలోమీటర్లు ప్రయాణం చేసినట్లు తెలిపారు. విభిన్న భాషలకు చెందినవారు తనను ఎంతో ఆదరిస్తున్నారని, పర్యావరణంపై తాను చేస్తున్న ప్రచారానికి విశేష స్పందన లభిస్తున్నాయని తెలిపారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సూచనలు, సలహాలు అందజేశారు.

కొనసాగుతున్న డీఎస్సీ టీచర్ల కౌన్సెలింగ్



ఆప్షన్ ఫారం ను స్వీకరిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : డీఈవో కార్యాలయంలో శుక్రవారం 1998, 2008 డీఎస్సీ టీచర్ల కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల టీచర్లు పాల్గొన్నారు. సీనియారిటీ జాబితా ప్రకారం సంబంధిత టీచర్లు పాఠశాలలను కోరుకున్నారు. 300 మందికి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. ప్రక్రియ ముగిసేందుకు శనివారం వేకువజాము అవుతుందని విద్యాశాఖ సిబ్బంది వెల్లడించారు. డీఈవో విజయేంద్రరావు, డీవైఈవో చంద్రశేఖర్, ఏడీ వెంకటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్: నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్ష దరఖాస్తుకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఈఓ శేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతూ, 01-05-2012 నుంచి 30-07-2014 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వెల్లడించారు. ఆసక్తిగలవారు ఆగస్టు 10వ తేదీలోపు 'సీబీఎస్ఈబీటీఎంఎస్.ఆర్‌సిఐఎల్.జీఓవి.ఇన్/ఎన్‌వీఎస్' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు అన్నీ నిండాయి. క్యూ వెలుపల టీబీసీ వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 67,294 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 33,529 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో భక్తులు రూ.4.09 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది.

జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి



జగనన్న సురక్షపై సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్యే శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తదితరులు

- ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్ల జారీ
- పథకాలు వందశాతం అర్హులకు చేరేలా వలంటీర్ల టీమ్ ఇంటింటి పర్యటన
- కార్యక్రమం పకడ్బందీ నిర్వహణ కోసం ప్రత్యేకాధికారుల నియామకం
- విజయవంతం చేయండి: జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశం

సాక్షి, చిత్తూరు: కుల, మత,వర్గ, పార్టీలకతీతంగా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం 'జగనన్న సురక్ష'' కార్యక్రమాన్ని తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ వై.మేఘ స్వరూప్, ఇతర అధికారులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కార్యక్రమం విజయవంతం కోసం చేపట్టిన చర్యలను జిల్లా కలెక్టర్ వివరించారు. అనంతరం ఈ కార్యక్రమంపై అధికారులకు దిశాదిశా నిర్దేశం చేశారు. అధికారులందరూ సమన్వయంతో క్షేత్ర స్థాయిలో మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. కార్యక్రమం నిర్వహణ, పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. చిత్తూరు నగర మేయర్ అముద, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌లు ధనుంజయ రెడ్డి, రమ్య, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ స్థాయి సంఘ చైర్మన్ భారతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ

జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు అన్ని క్యాంపులను తనిఖీ చేస్తారు. పురోగతిపై రోజు వారీగా కలెక్టర్ సమీక్షిస్తారు.

ప్రత్యేక అధికారులు వీరే

డీపీఓ, డీఆర్‌డీఏ, డ్వామా, డీడీ సోషల్ వెల్ఫేర్ అధికారులు లక్ష్మి, తులసి, గంగా భవాని, రాజ్యలక్ష్మిని నియమించారు.

పథకం నిర్వహణ ఇలా

వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వానికి మద్దతు ఇచ్చే ఔత్సాహికులతో కూడిన టీమ్ వారం, పది రోజుల పాటు ప్రతి ఇంటినీ సందర్శిస్తారు. అర్హులై ఉండి ఎక్కడైనా లబ్ధి అందనివారుంటే గుర్తిస్తారు. ఆ సమస్య పరిష్కారానికి కావలసిన పత్రాలను సేకరిస్తారు.. ఎవరికైనా కుల, ఆదాయ, జనన తదితర సర్టిఫికెట్లు అవసరమైతే వాటికి సంబంధించిన డాక్యుమెంట్లను తీసుకుని దరఖాస్తులను దగ్గరుండి నమోదు చేయిస్తారు.

టోకెన్ల జారీ

సచివాలయానికి వెళ్లి ఆ పత్రాలను సమర్పించి టోకెన్ నంబర్, సర్వీస్ రిక్వెస్ట్ నంబరు తీసుకుని వలంటీర్లతో కూడిన టీమ్ దరఖాస్తుదారులకు అందజేస్తుంది. ఏ తేదీన ఆ గ్రామంలో మండల స్థాయి అధికారులు క్యాంపు నిర్వహిస్తారో తెలియజేస్తారు. క్యాంపు జరిగే రోజు దగ్గరుండి క్యాంపు వద్దకు తీసుకెళ్తారు. సమస్య పరిష్కారమయ్యేలా వారికి తోడుగా ఉంటారు.

నియోజక వర్గాల వారీగా....

పలమనేరు– గోవర్ధన్ రెడ్డి, డీడీ గ్రౌండ్ వాటర్
నగరి– మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి
పుంగనూరు– మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి
జీడీ నెల్లూరు– సుబ్రహ్మణ్యం, ఈడీ బీసీ కార్పొరేషన్
కుప్పం– చిన్నారెడ్డి, మైనారిటీ సంక్షేమ అధికారి
పూతలపట్టు– నరసింహులు, ఈడీ ఎస్సీ కార్పొరేషన్
చిత్తూరు–రవి కుమార్ రెడ్డి, డీడీ ఫిషరీస్

1 నుంచి క్యాంపుల నిర్వహణ

తహశీల్దార్, ఈవోపీఆర్డీ ఒక టీమ్‌గా, ఎంపీడీవో, డిప్యూటీ తహశీల్దార్ రెండో టీమ్‌గా సచివాలయంలో ఒక రోజు పూర్తిగా పనిచేసేలా కార్యక్రమం రూపొందించారు. జూలై 1వ తేదీ నుంచి ప్రతి సచివాలయంలో క్యాంపు నిర్వహించి అక్కడికక్కడే సమస్యలను పరిష్కరిస్తారు.

ఫీజు లేకుండా సర్టిఫికెట్ల జారీ

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో మార్పులు చేర్పులు వంటి 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా జారీ చేస్తారు. ఇందులో జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ, వివాహ ధృవీకరణ పత్రాలు, మ్యూటేషన్లు, ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం, సీసీఆర్‌సీ కార్డులు, కొత్త రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజనతోపాటు ప్రజలకు అవసరమైన ఇతర సర్టిఫికెట్లను కూడా అందించేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

1902 హెల్ప్ డెస్క్

వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, సమస్యల పరిష్కారం కోసం ఇళ్లను సందర్శించినప్పుడు అర్హులు ఇంటివద్ద అందుబాటులో లేకుంటే, క్యాంపు జరిగే రోజు నేరుగా అక్కడికి వెళ్లి సమస్యను పరిష్కరించుకోవచ్చు. వలంటీర్లతో కూడిన ఈ టీమ్ 1902 హెల్ప్ డెస్క్ ద్వారా అవసరమైన సహాయం అందిస్తారు. ఏ గ్రామంలో.. సచివాలయ పరిధిలో ఏ రోజు ఈ కార్యక్రమం జరుగుతుందో తెలుసుకోవాలంటే టోల్ ఫ్రీనంబర్ 1902కు కాల్ చేయవచ్చు. లేదా vswsonline.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



చెక్కును అందిస్తున్న మంత్రి ఆర్కే రోజా

నగరి : స్థాయికి మించి వైద్య ఖర్చులు చేసుకున్న బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. నిండ్ర మండలం, చవరంబాకం గ్రామానికి చెందిన పేరం మోనిషకు మంత్రి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. మోనిష ప్రసవ సమంలో తీవ్ర చిక్కులను ఎదుర్కొంది. మేజర్ ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. పుట్టిన బిడ్డ అస్వస్థతకు లోనుకావడంతో ప్రత్యేక వైద్యచికిత్స అందించాల్సి వచ్చింది. కుటుంబ సభ్యులు అప్పులు చేసి రూ.8 లక్షలకు పైగా ఖర్చు చేశారు. మంత్రి ఆర్కేరోజాను కలిసి తమ పరిస్థితిని వివరించి సాయం చేయాలని కోరారు. తల్లిమనస్సుతో ఆలోచించి దీనిపై స్పందించిన మంత్రి ఈ అంశాన్ని సీఎం సహాయనిధి విభాగానికి తీసుకెళ్లి రూ.7.50 లక్షలు మంజూరు చేయించారు. శుక్రవారం సహాయనిధి చెక్కును మోనిషాకు మంత్రి ఆర్కేరోజా అందజేశారు. మంత్రి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలను ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఇది జీవితాంతం మరువలేని సాయమని బాధితురాలు కృతజ్ఞతలు తెలిపింది. నిండ్ర మండల ప్రజా ప్రతినిధులు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇక మాకెవరు దిక్కు తండ్రీ..!

అప్పుడే నూరేళ్లు నిండాయా తండ్రీ..చెరమాంకంలో మాకు సాయంగా ఉంటావనుకున్నామే.. నీవే లేకుటే మేమెలా బతకాలి.. అంటూ కుమారుల మృతదేహాల ముందు తల్లిదండ్రులు గుండె లవిసేలా రోదించడం అక్కడి వారి హృదయాలను ద్రవింపజేశాయి. చేతికెదికిన కొడుకులు రోడ్డు ప్రమాదంలో అర్ధంతరంగా దూరం కావడం రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. శాంతిపురం మండలం కడపల్లె వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో మోటార్ సైకిల్‌లో వస్తున్న ఇద్దరు యువకులు మృతి చెందడం బోయనపల్లె శోకసంద్రమైంది.

- మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఇద్దరు యువకులు మృతి
- శాంతిపురం మండలం బోయనపల్లెలో విషాదం



శివరాం మృతదేహం వద్ద బంధువుల రోదనలు

శాంతిపురం: కుప్పం–పలమనేరు జాతీయ రహదారి కడపల్లె వద్ద శుక్రవారం మోటార్ సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. రాళ్లబూదుగూరు పోలీసుల కథనం మేరకు.. కెనమాకులపల్లె పంచాయతీ బోయనపల్లెకు చెందిన శివరాం(22) మోటార్ సైకిల్‌పై సొంతపనిగా కుప్పం వెళ్లాడు. తిరిగి వస్తుండగా గ్రామానికి చెందిన లోకేష్(23) కనిపించడంతో బైక్‌లో ఎక్కించుకున్నాడు. కుప్పం వైపు నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. కడపల్లె సమీపంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల వద్ద మోటార్ బైక్‌ను ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలైన శివరాం అక్కడికక్కడే మృతి చెందాడు. లోకేష్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రయాణికుల సమాచారంతో నిమిషాల్లో ప్రమాద స్థలానికి వచ్చిన 108 అంబులెన్స్ ద్వారా లోకేష్‌ను కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లోకేష్ కూడా ప్రాణాలు విడిచాడు.

రెండు కుటుంబాల్లో తీరని వ్యథ

ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న బోయనపల్లెకు చెందిన నాగభూషణం, చెంగమ్మలకు శివరాం కుమారుడు. కుమార్తెకు పెళ్లి చేసి పంపేశారు. చదువు అబ్బక పోవడంతో మూడు నెలల కిందట శివారంకు ఫైనాన్సులో ఆటోను కొనిచ్చారు. శుక్రవారం మోటార్‌బైక్‌లో కుప్పం వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. ప్రమాద స్థలంలో శివరాం మృతదేహం వద్ద తమ ఇంటి దీపం ఆరిపోయిందంటూ కన్నవారు, బంధువుల రోదనలు మిన్నంటాయి. అదే గ్రామానికి చెందిన మురుగన్, సుమతిల కుమారుడు లోకేష్ డిగ్రీ చదువుతున్నాడు. కుప్పంలో పరీక్ష ముగించుకుని గ్రామానికి చెందిన శివరాం తారసపడడంతో కలిసి మోటార్ సైకిల్‌పై ఇంటికి బయలుదేరి ప్రమాదంతో మృత్యుఒడిలోకి చేరాడు.





మృతులు శివరాం, లోకేష్ (ఫైల్)

– శ్రీరంగరాజపురం మండలానికి చెందిన జోత్స్న (పేరు మార్చాం) అనే యువతికి, నగరికి చెందిన రాజీవ్ అనే యువకుడికి ఈ ఏడాది జనవరిలో పెళ్లి నిశ్చయమైంది. అయితే పెళ్లికి ముందు వరుడు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని యువతి అందరి ముందు తేల్చి చెప్పింది. దీంతో ఆ యువకుడు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకుని రిపోర్టులు పంపించాడు. ఆ తర్వాత వివాహం జరిగింది.

– బెంగుళూరులో నివాసముంటున్న శరణ్య (పేరుమార్చాం), తవణంపల్లెకు చెందిన రమేష్ ఇద్దరూ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేస్తున్నారు. ఇద్దరికి ముఖపరిచయం ఉంది. మార్చిలో వీరికి పెద్దల అంగీకారంతో వివాహమైంది. అయితే పెళ్లికి ముందు ఇద్దరూ స్వచ్ఛందంగా వైద్యుడిని సంప్రదించి అన్ని రకాల పరీక్షలు చేయించుకున్నారు. ఆ మేరకు సలహాలు, సూచనలు తీసుకున్నారు.

– తిరుపతి బాలాజీకాలనీకి చెందిన అనితకి (పేరుమార్చాం) సమీప బంధువుతో 2022 నవంబరు 26వ తేదీన తల్లిదండ్రులు పెళ్లి చేశారు. నెల తిరగక ముందే పంచాయితీ పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కింది. పోలీసులు విచారించగా వరుడికి అనారోగ్య సమస్యలు ఉన్నట్లు అతడి కుటుంబీకులే ఒప్పుకున్నారు. దీంతో యువతి వెంటనే విడాకుల కోసం దరఖాస్తు చేసుకుంది. వీరి పెళ్లి మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది.

ఆనంద దాంపత్యానికి ఆరోగ్య పరీక్షలు



పెళ్లంటే నూరేళ్ల పంట.. వివాహంతో రెండు జీవితాలు ముడిపడతాయి.. రెండు కుటుంబాల నడుమ బాంధవ్యాలు కలుస్తాయి.. ఆదిలోనే హంసపాదు అన్నట్లు వధూవరుల్లో ఎవరో ఒకరికి అనారోగ్య సమస్యలు ఉన్నట్లు తెలియడంతో కొన్ని పెళ్లిళ్లు విచ్ఛిన్నమవుతున్నాయి. మాయదారి రోగాల కారణంగా నూతన జంటలు విడిపోతున్నాయి. ఈ క్రమంలో యువతీయువకులు మ్యారేజ్‌కు ముందుగానే హెల్త్ టెస్ట్‌లు చేయించుకునేందుకు మొగ్గుచూపుతున్నారు. ఆనంద దాంపత్యానికి ఆరోగ్య పరీక్షలు అవసరమని భావిస్తున్నారు.. కోవిడ్ తర్వాత నుంచి ఈ విధానానికి అధిక సంఖ్యలో ఆసక్తి కనబరుస్తున్నారు. – సాక్షి, తిరుపతి డెస్క్

- పెళ్లికి ముందే హెల్త్ టెస్ట్‌లు
- స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న వధూవరులు
- కోవిడ్ అనంతరం పెరిగిన అవగాహన
- మార్పు మంచిదే అంటున్న వైద్యులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3 వేలకు పైగా కల్యాణ మండపాలు ఉన్నాయి. లగ్నాల మాసాల్లో రోజూ వందల సంఖ్యలో పెళ్లిళ్లు జరుగుతుంటాయి. ముఖ్యంగా తిరుమల, తిరుపతి, కాణిపాకం, చిత్తూరు, శ్రీకాళహస్తి తదితర క్షేత్రాల్లో ఎక్కువగా పెళ్లి బాజాలు మోగుతుంటాయి. నూతన వధువరులు వందేళ్లు కలిసి జీవించాలనే పెళ్లి నాడూ పెద్దలు ముడి వేయిస్తుంటారు. కానీ ఎక్కువ మంది ఆ వివాహ బంధాన్ని కాపాడుకోలేక మధ్యలోనే విడిపోతున్నారు. పెళ్లి తర్వాత ఎదురయ్యే సమస్యల్లో కొన్నిసార్లు పెద్దలు, సైకాలజిస్టులు, పోలీసులు సర్దిచెప్పి దాంపత్య జీవితాన్ని నిలబెడుతున్నారు. కాని ఆరోగ్య సమస్యలను దాచి వివాహం చేసిన సందర్భాల్లో మాత్రం విడాకులే శరణ్యం అవుతున్నాయని వైద్యులు, సామాజిక వేత్తలు చెబుతున్నారు. అయితే ఇప్పుడు వివాహానికి ముందు వధువు, వరుడు ఆరోగ్య పరీక్షల రిపోర్టులను తల్లిదండ్రులు అడుగుతున్నారు. అంతా సక్రమంగా ఉంది అనుకున్నాకే పెళ్లికి ముహూర్తం ఖరారు చేసుకుంటున్నారు. ఈ విధానం దాంపత్య జీవితానికి శ్రేయస్కరమని అందరూ విశ్వసిస్తున్నారు.

ఆలోచించి.. అడుగులు వేద్దాం.

వివాహం అంటే ప్రతి ఒక్కరి జీవితంలో కీలక ఘట్టంగా భావిస్తారు. అంచనాలకు మించి హడావిడీ చేస్తుంటారు. పెద్దమొత్తంలో సొమ్ము వెచ్చించి అంగరంగ వైభవంగా జరిపిస్తుంటారు. అయితే వేద మంత్రాల మధ్య ఒక్కటైన ఆ బంధం కొద్ది రోజులకే విడిపోతే ఆ ప్రభావం వారి మీదనే కాదు కుటుంబ సభ్యులపై కూడా పడుతుంది. ముఖ్యంగా ఆరోగ్య సమస్యలను దాచి వివాహం చేసుకున్న జంటలే ఎక్కువగా విడిపోతున్నారని ఓ అధ్యయనంలో తేలింది. అందుకే పెద్దలు అటు ఏడు తరాలు.. ఇటు ఏడు తరాలు చూడాలనే సంకేతాన్ని ఇచ్చారని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలను దాచి వివాహం చేస్తే దంపతులకు తీరని అన్యాయం చేసిన వారవుతారని సామాజిక నిపుణులు, వైద్యులు సైతం హెచ్చరిస్తున్నారు. వివాహానికి ముందు అమ్మాయి, అబ్బాయి హెల్త్ చెకప్ చేయించుకుంటే ఎటువంటి సమస్య ఉండదు. వారికి తెలియని వ్యాధులు కూడా ఉండొచ్చని వైద్యులు చెబుతున్నారు. అవగాహనతో వివాహం చేసుకుంటే ఎలాంటి సమస్యలు ఉండవని సూచిస్తున్నారు.

పరీక్షలు ఇలా...

- ఎస్‌టీడీ (సెక్సువల్లీ ట్రాన్స్‌మిటెడ్ డిసీజ్) టెస్ట్. ఇందులో ఎయిడ్స్, సిఫిలిస్, గనేరియా తదితర వ్యాధులు ఉంటే బయటపడుతాయి. అవి ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అవకాశం ఉంది. ఫలితంగా సంతానం కూడా కలగక బాధపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.
- హిమోగ్లోబిన్ ఎల్రక్టో ఫోరోసిస్ టెస్ట్‌తో తలసీమియా, సికిల్ సెల్ డిసీజ్ లాంటి అనువంశిక డిజార్డర్ తెలిసిపోతుంది. ఒకవేళ వధువు, వరుడు ఇద్దరు ఈ వ్యాధికి గురైతే సంతానానికి కూడా సోకుతుంది. అందుకే వివాహానికి ముందే టెస్ట్ చేయించుకుంటే భయంకరమైన రోగాల నుంచి బయటపడొచ్చు.
- ఫెర్టిలిటీ టెస్ట్‌తో సంతాన సామర్థ్యం తెలిసిపోతుంది. జెనెటిక్ డిసీజ్ చెకప్‌తో వంశపారంపర్య వ్యాధులు ఉంటే తెలుస్తుంది. వాటితో పాటు జనరల్ హెల్త్ చెకప్ కూడా అవసరమేనని వైద్యులు సూచిస్తున్నారు. దంపతులకు ఆరోగ్య విషయాలపై అవగాహనతో ఉంటే వారి దాంపత్య జీవితం సాఫీగా సాగుతుందని వెల్లడిస్తున్నారు.

ఏ మాత్రం తప్పులేదు



పెళ్లికి ముందు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడమంటే చాలామంది విడ్డూరంగా చూస్తున్నారు. ఓ రకంగా ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంలో ఏమాత్రం తప్పు లేదు. పెళ్లికి ముందు వారి వ్యాధులను దాచిపెట్టడం మంచిది కాదు. దాని దుష్పరిణామం వారు జీవితాంతం భరించాల్సి వస్తుంది.
– రాజశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

అర్థం చేసుకోవాలి



పెళ్లికి ముందు ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. శారీరక, మానసిక, ఆర్థిక విషయాలను చర్చించుకుని అవగాహనకు రావాలి. ప్రస్తుత పరిస్థితుల్లో తల్లిదండ్రులు కేవలం ఆర్థిక విషయాలకే పరిమితమవుతున్నారు. అయితే సంబంధాలు కుదుర్చుకునేప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ముందుగా ఆరోగ్య పరీక్షలు చేయించాలి. ప్రస్తుతం చాలామంది ఆలస్యంగా వివాహాలు చేసుకుంటున్నారు. దీంతో ఇబ్బందులు వస్తాయి. – హర్షవర్ధన్, డీపీఎంఓ


తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,450
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,000
రిటైల్ వెండి గ్రాము	రూ.71.00

జీఓ 110 అమలు చేయండి

కుప్పం: ద్రవిడ వర్సిటీలో జీఓ 110 అమలు చేయాలని వర్సిటీ రిజిస్ట్రార్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. శుక్రవారం గుడుపల్లెలో జరిగిన పల్లె బాటలో భాగంగా యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు మంత్రిని కలసి తమకు 110 జీఓను అమలు చేయాలని వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓను వెంటనే అమలు చేయాలని వర్సిటీ అధికారులను ఆదేశించారు. తమ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కార్మికులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సంస్థలో మూడో పార్టీ విధానాన్ని రద్దు చేసి, నేరుగా జీతాలు అందివ్వాలని, 2022 పీఆర్సీతో కూడిన డీఏ, ఇంక్రిమెంట్లతో కూడినా వేతనాలు ఇవ్వాలని వారు కోరారు. దీనిపై కూడా మంత్రి సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

చెక్‌డ్యామ్‌లో మునిగి తమిళ వాసి మృతి

కుప్పంరూరల్: ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులోని చెక్‌డ్యామ్‌లో పడి తమిళవాసి మృతి చెందిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం వాణియంబాడికి చెందిన గోవిందరాజ్ (26) కనకనాశమ్మ దేవాలయానికి వచ్చాడు. అక్కడే ఉన్న చెక్‌డ్యామ్‌లో స్నానం చేసేందుకు వెళ్లి నీటిలోకి దిగాడు. నీటిలో జారిపోయి పైకి రాలేక పోయాడు. గమనించిన స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. సమాచారం అందుకున్న కుప్పం పోలీసులు ఫైర్ సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టమ్ నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా ధ్వంసం


దాడుల్లో పాల్గొన్న సెబ్ సిబ్బంది

కుప్పంరూరల్: కుప్పం మండల, దేవరాజపురం అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించి 245 లీటర్ల సారా, 3,900 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు కుప్పం సెబ్ సీఐ కిషోర్ కుమార్ తెలిపారు. చిత్తూరు సెబ్ ఏఈఎస్ ఆయేషా బేగం ఆధ్వర్యంలో తమిళ అధికారులతో కలిసి దాడులు చేసినట్లు చెప్పారు. దేవరాజపురం అటవీ ప్రాంతంలో అమ్మకానికి సిద్ధం చేసిన 245 లీటర్ల నాటు సారా, 3,900 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఆయేషాబేగం మాట్లాడుతూ, సారా తయారీ చట్ట వ్యతిరేకమని, ఎక్కడైనా తయారు చేస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని తెలిపారు. దాడుల్లో సెబ్ ఇన్‌స్పెక్టర్ మాధవస్వామి, వెంకటలక్ష్మి, వీరాస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: గుడిపాల మండంలోని చిత్తపార గ్రామంలో శుక్రవారం ఎస్ఈబీ అధికారులు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నందకుమార్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు. పొన్నుస్వామి అనే మరో వ్యక్తి పరారయ్యాడు. వీరి వద్ద 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 300 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. నిందితుడి అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలించారు. సీఐ జోగేంద్ర, అధికారులు ఊహాసిరి, బాబు, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ లేకుండా పరిహారం చెల్లించండి

- అనీమియా వ్యాధిపై అవగాహన కల్పించండి
- జగనన్న సురక్ష విజయవంతం చేయండి
- సమీక్షలో కలెక్టర్ షణ్మోహన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో హైవే రోడ్డు పనులకు సంబంధించి నష్టపరిహారం పెండింగ్ లేకుండా లబ్ధిదారులకు అందజేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బెంగళూరు–చెన్నై, చిత్తూరు–తచ్చూరు రోడ్ల అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. గుడిపాల మండలం వసంతాపురం గ్రామం వద్ద ఉన్న అటవీ భూమికి సంబంధిత శాఖ అధికారులు అనుమతులు ఇవ్వాలన్నారు. వి.కోట, బైరెడ్డిపల్లి మండలాల్లో బైపాస్ రోడ్డు ఏర్పాటుకు భూముల 3డి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పలమనేరు ఆర్డీఓను ఆదేశించారు. విజయపురం, నగరి మండలాల్లో భూములు, బోర్లు నష్టపోయిన లబ్ధిదారులకు చిత్తూరు, నగరి ఆర్డీఓలు, తహసీల్దార్లు సమన్వయం చేసుకుని లబ్ధిదారులకు పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రైల్వే ప్రాజెక్టు పనుల్లో కుప్పం–గుడుపల్లె మండల పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ, డీకేటీ భూముల సమస్యలను జూలై ఒకటో తేదీ లోపు పరిష్కరించాలని ఆదేశించారు. జూలై ఒకటి నుంచి లబ్ధిదారులకు పరిహారం అందజేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

అనీమియా నివారణకు చర్యలు

క్షేత్రస్థాయిలో అనీమియా వ్యాధిపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలో 0–5సంవత్సరాల పిల్లలందరికీ జనన ధ్రువీకరణ పత్రాలు కచ్చితంగా ఇప్పించాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కౌమార దశ బాలికలల్లో అనీమియా నివారణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. ఇందులో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది రక్తహీనత నివారణకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఅండ్‌హెచ్‌వో రాజశేఖర్‌రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష

తహసీల్దార్లు, ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. ఎలాంటి చిన్న తప్పులు జరగకుండా జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నాడు–నేడు పనులను సకాలంలో పూర్తి చేయించాల్సిన బాధ్యత ఎంఈవో, హెచ్ఎంలదేనని ఆదేశించారు. జెడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శోకసంద్రంలో తెల్లరాళ్లపల్లె

- చిన్నారుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే, జెడ్పీ వైస్ చైర్మన్
- ప్రభుత్వం నుంచి రూ.7లక్షలు సాయం


రూ.7లక్షల చెక్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి

యాదమరి: ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు నీటికుంటలో పడి మృతిచెందడంతో మండలంలోని తెల్లరాళ్లపల్లె శోకసంద్రమైంది. గ్రామానికి చెందిన సతీష్, హేమలత దంపతుల కుమార్తె పూర్ణశ్రీ(9), కుమారుడు మదన్(2) పాఠశాల ఆవరణలోని నీటి కుంటలో ప్రమాదవశాత్తు జారి పడి గురువారం రాత్రి మృతి చెందిన సంఘటన తెలిసిందే. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి శుక్రవారం ఆగ్రామానికి వెళ్లారు. బాధిత తల్లిదండ్రులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం ప్రభుత్వం నుంచి రూ.7లక్షలు సహాయం చేశారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. అలాగే సెప్టిక్ ట్యాంక్‌కు గొయ్యి తీసి నిర్మాణం చేపట్టక నిర్లక్ష్యం చేసిన కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చిన్ని పిల్లల మృతికి సమగ్ర నివేదిక ఇవ్వాలని విద్యాశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు.

గొయ్యిని పూడ్చివేసిన అధికారులు

ఇద్దరు చిన్నారుల మృతికి కారణమైన గొయ్యిని ఆర్డీఓ రేణుక ఆదేశాల మేరకు శుక్రవారం మట్టితో అధికారులు పూడ్చి వేయించారు. ఉదయం ఆర్డీఓ సంబంధిత అధికారులతో మాట్లాడి గొయ్యిని పూడ్చి వేసి పాఠశాలలో నిర్వహించాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి నివేదికలు ఇవ్వాలని కోరారు. పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

నోట్ల మార్పిడికి నయా మార్గాలు

రూ.2 వేల నోట్ల ఉపసంహరణ నేపథ్యంలో బ్లాక్‌ను వైట్ చేసుకొనేందుకు బడాబాబులు రకరకాల మార్గాలు అనుసరిస్తున్నారు. బంగారు, భూముల కొనుగోళ్లపై భారీగా నగదును వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. సగటున ఉమ్మడి జిల్లాలో సాగే బంగారు వ్యాపారాలకంటే ప్రస్తుతం 20 శాతం అధికంగా అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం. సరైన ప్రూఫ్స్ ఉంటే అకౌంట్‌లో డిపాజిట్ చేసుకోవడమే మేలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఈదిశగా కూడా బ్యాంకుల్లో డిపాజిట్లు పెరుగుతున్నాయి. జిల్లాలో ఇప్పుడు ఎటూ చూసినా రెండువేల నోట్లపై చర్చ జరుగుతోంది. – పలమనేరు



- పెద్దనోట్లను మార్చుకునేందుకు పెద్దల ప్రయత్నాలు
- బంగారంగా మార్చుకుంటున్న బడాబాబులు
- జిల్లాలో భారీగా పెరిగిన బంగారు కొనుగోళ్లు
- భూముల కొనుగోళ్లపై కొందరు పెట్టుబడులు
- మార్చేందుకు రంగంలోకి కమీషన్ ఏజెంట్లు

రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా రెండువేల నోట్లను సెప్టెంబర్ 30లోపు మార్చుకోవాలనే నిబంధనతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బడాబాబులు రకరకాల పద్ధతులను అనుసరిస్తున్నారు. డీమోనటరైజేషన్ తర్వాత రెండువేల నోట్లు కనిపించకుండా పోయాయి. సాధారణ లావాదేవీల్లో, బ్యాంకు ఏటీఎంలలోనూ వీటి ఊసేలేకుండా పోయింది. దీంతో సామాన్యులకు ఈ నోటుతో పనిలేకుండా పోయింది. ప్రస్తుతం రెండువేల నోట్ల మార్చుకునే విషయంపై సామాన్యజనం అసలు పట్టించుకోవడం లేదు. రెండువేల నోట్లను రోజుకు రూ.20 వేల వరకు బ్యాంకులో మార్చుకోవచ్చని ఆర్‌బీఐ తెలిపింది. మే 23 నుంచి సెప్టెంబరు 30 దాకా సాధారణ సెలవులు, బ్యాంకు సెలవులు పోగా కేవలం వందరోజుల మాత్రమే పనిచేస్తాయి. రోజుకు రూ.20 వేలు మార్చుకుంటే వందరోజులకు రూ.20 లక్షలను మాత్రమే మార్చుకునే అవకాశం ఉంది. దీంతో బడా బాబులు భూములపై పెట్టుబడులు పెడుతున్నారు. ఎకరా సెటిల్‌మెంట్ పొలం వ్యాల్యుయేషన్ రూ.20 లక్షలుగా ఉండగా దానికి ప్రభుత్వ విలువ రూ.3 లక్షల వరకు ఉంటుంది. ఈ భూములను కొన్న వారు ప్రభుత్వ మార్కెట్ విలువ మేరకు స్టాంపు డ్యూటీ చెల్లించి ఆ మొత్తాన్ని మాత్రం వైట్ కరెన్సీ ఇచ్చి మిగిలిన పైకాన్ని బ్లాక్‌లో ఇవ్వడం ఇప్పుడు రెండువేల నోట్ల మార్పిడిలో సాగుతున్న మరో తంతు. ఇవికాక పెట్రోలు బంకులు, మద్యం దుకాణాలు, అమెజాన్‌లాంటి ఆన్‌లైన్ వ్యాపారాల్లో పేఆన్ డెలవరీలాంటి ద్వారా నోట్ల మార్పిడి సాగుతోంది.

20శాతం పెరిగిన బంగారు అమ్మకాలు

బడాబాబులు బంగారాన్ని కొనుగోలు చేసే పనిలో పడినట్లు తెలుస్తోంది. ఆభరణాలను కొంటే మేకింగ్ చార్జీ, తరుగు, జీఎస్టీ మూడుశాతం లాంటివి ఉంటుండడంతో కేవలం బిస్కెట్లు, కాయిన్స్‌గా కొంటున్నట్లు తెలుస్తోంది. ఇదే అదునుగా భావించిన కొందరు దుకాణ నిర్వాహకులు గ్రాముపై అధిక ధర ఇస్తేనే రెండు వేలనోట్లను తీసుకుంటామంటూ షరతులు పెడుతున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో సాధారణంగా సాగే వ్యాపారాలకంటే ప్రస్తుతం 20 శాతం అధికంగా జరుగుతున్నట్లు సమాచారం.

భారీగా బ్యాంకు డిపాజిట్లు

రోజుకి రూ.20వేలు మాత్రమే రెండువేల నోట్లను మార్చుకోవాల్సి ఉంది. కానీ డిపాజిట్లకు మాత్రం నిబంధనలు లేవు. దీంతో పలు బ్యాంకులు ఇలాంటి వారి ద్వారా భారీగా డిపాజిట్లను సేకరిస్తున్నాయి. మరికొందరు తమ బంధువులు బ్యాంకులో పెట్టిన బంగారాన్ని రూ.2వేల నోట్లతో విడిపించి, మళ్లీ మరో బ్యాంకులో వాటిని తనఖా పెట్టి వైట్ కరెన్సీని అధికారికంగా పొందుతున్నారు.

నోట్లను మార్చేందుకు కమీషన్ ఏజెంట్లు

రోజూ బ్యాంకుల్లో డబ్బులు మార్చేందుకు కమీషన్ ఏజెంట్లు అందుబాటులో ఉంటున్నారు. వీరు డబ్బున్న ఆసాముల నుంచి రెండువేల కరెన్సీ పొంది తమ మనుషుల ద్వారా బ్యాంకులోవారి ఖాతోల్లోకి జమచేస్తున్నారు. తద్వారా వీరికి రూ.20 వేలకు రూ.500 కమీషన్‌గా పొందుతున్నారు.